క్లుప్తంగా

జెండా బాలాజీ ఆలయ హుండీ లెక్కింపు



నిజామాబాద్ సిటీ: నగరంలోని జెండా బాలాజీ ఆలయ హుండీని శుక్రవారం దేవాదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఈవో వేణు ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయానికి హుండీలో రూ.2.64 లక్షల ఆదాయం వచ్చింది. ఆలయ కమిటీ చైర్మన్ జాలిగాం గోపాల్, ధర్మకర్తలు రాముగౌడ్, నర్సింగ్‌రావు, విజయ, నాగభూషణం, అగ్గు సంతోష్, అర్చకుడు వెలగలేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాపరి గృహ ప్రతిష్ఠ ఆరాధన



డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ సీఎస్ఐ చర్చిలో శుక్రవారం కాపరి నూతన గృహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ అధ్యక్ష మండల ఇన్‌చార్జి బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పద్మారావు దైవ సందేశం వినిపించారు. ఈ సందర్భంగా 24మంది యువతీ, యువకులు క్రీస్తును తమ సొంత రక్షకునిగా అంగీకరించారు. మెదక్ అధ్యక్ష మండల అధికారులు ఎం దయానంద్, ఎం విల్సన్, జి ప్రభుకిరణ్, సాల్మన్, సంఘం సభ్యులు వి సామ్యేల్, నీరడి పద్మారావు, దేవరాజ్, పౌలు, సురేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య పరీక్షలు



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డాక్టర్ శీనూనాయక్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. 142 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంధ్యానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



సిరికొండ: పదో తరగతి, ఇంటర్‌లో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రావుట్ల చిన్న నర్సయ్య నగదు పురస్కారాలను ఏవో వెంకటేష్, మెడికల్ ఆఫీసర్ అరవింద్ అందజేశారు. మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచిన సిద్దార్థ, రిష్మిత, స్ఫూర్తి, కీర్తన, ఇంటర్‌లో శ్రీలతకు రూ.2500 నగదుతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందచేసి అభినందించారు. స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సాల్మన్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ఏఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ నర్సయ్య పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం



సిరికొండ: మండల కేంద్రం నుంచి చీమన్‌పల్లి వెళ్లే మార్గంలో సబ్ స్టేషన్ వద్ద కల్వర్టు నిర్మాణానికి ఆర్అండ్‌బీ ఏఈ మనోహర్ శుక్రవారం మార్కింగ్ ఇచ్చారు. ఏడు లక్షల నిధులు న్నప్పటికి పనులు ప్రారంభం చేయడం లేదని, ధ్వంసమైన కల్వర్టుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వివరించారు. దీంతో పనులను త్వరగా ప్రారంభించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో శుక్రవారం కల్వర్టు నిర్మించే ప్రాంతంలో ఏఈ ముగ్గు పోశారు. కాంగ్రెస్ నాయకులు దిగంబర్, మహేష్‌రెడ్డి, శోభన్ ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ధర్పల్లి: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై వంశీకృష్ణ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణ పట్ల విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రజియొద్దిన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- ఇబ్బందులు పడుతున్న పద్మనగర్‌వాసులు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని పద్మనగర్ రోడ్డు నంబర్ –3లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. స్తంభాలు వంగిపోవడంతో అవి ఎక్కడ తమ ఇండ్లపై, రోడ్లపై పడుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్తంభాలు సరిచేయాలని విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్దామంటే ఇటువైపు ఎవరూ రాక సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పద్మనగర్‌లో అసలే ఇరుకైనా రోడ్లు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వంగిన స్తంభాలను ఏదైనా వాహనం ఢీకుంటే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతంలో అనేక ఇళ్లు ఉండటంతో ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఉంది. ఒక స్తంభం నుంచి అనేక కనెక్షన్లు ఉండటంతో వైర్లు గజిబిజిగా మారాయి. అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే వంగిన స్తంభాలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.





పద్మనగర్‌లో రోడ్ నంబర్ - 3లో వంగిన విద్యుత్ స్తంభాలు

నెలల తరబడి ఇలాగే ఉంది

పద్మనగర్ రోడ్డు నంబర్ 3లో మా ఇంటి ముందు విద్యుత్ స్తంభం ఒరిగి చాల నెలలు అవుతోంది. ఈ సమస్యను చెబుదామంటే నాయకులు, అధికారులు ఎవరూ ఇటువైపు రావటంలేదు. ప్రమాదం జరుగక ముందే వంగిన స్తంభాలను సరిచేయాలి.



– రాజవ్వ, స్థానికురాలు

ఇళ్లకు తగులుతున్నాయి

పద్మనగర్‌లో 30 ఏళ్ల క్రితం విద్యుత్ స్తంభాలు వేశారు. స్తంభాలు వంగి వైర్లు ఇంటిపై మేడ గోడలకు తగులుతుండటంతో భయంగా ఉంది. పిల్లలు ఆడుకుంటూ వెళ్తూ స్తంభాన్ని తాకితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కాలనీ అభివృద్ధి కమిటీ తరఫున సమస్యను అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.



– జగదీశ్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు



గడ్కోల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నడిపల్లి శివారులో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

సిరికొండ: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆరోపించారు. మండలంలోని గడ్కోల్‌లో కప్పలవాగుపై 12 కోట్లతో నిర్మించనున్న భారీ వంతెన పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కప్పలవాగుపై చెక్ డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రొసీడింగ్‌లు ఇచ్చి ఓట్లు వేయించుకోవాలని చూశారని ఆరోపించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, గడీల రాములు, పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, సంతోష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, భానుచందర్, సంపత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, బసంత్, రాంచందర్‌రెడ్డి, లింబాద్రి, అఖిల్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం వరకు రహదారుల అనుసంధానం

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, గిరిజన తండాల నుంచి మండల కేంద్రం, జిల్లా కేంద్రం వరకు రహదారులను అనుసంధానిస్తామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామని, రహదారులపై అవసరం ఉన్న చోట తప్పకుండా హై లెవల్ బ్రిడ్జి (హెచ్ఎల్‌బీ)లను నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారు పెట్రోల్ బంక్ వద్ద నిజామాబాద్–హైదరాబాద్ రోడ్డుపై రూ.2కోట్ల వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. త్వరగా పనులు చేపట్టి వర్షాకాలం ప్రారంభం కాకముందే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రూరల్ నియోజకవర్గంలో శుక్రవారం చేపట్టిన హైలెవల్ వంతెనల నిర్మాణ పనుల శంకుస్థాపనలు గత ప్రభుత్వ హయాంలోనే చేసినట్లు చెప్పుకుంటున్నారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే అగ్రిమెంట్లు పూర్తయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, నాయకులు ముప్పగంగారెడ్డి, గడీల రాములు, కంచెట్టి గంగాధర్, ఎంపీటీసీ నర్సయ్య, ధర్మాగౌడ్, వాసుబాబు, శ్యాంసన్, డాక్టర్ శాదుల్లా, పాలసాని శ్రీనివాస్, చాకటి మురళి పాల్గొన్నారు.

ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలోని వెంగలపాడు, లింగాపూర్ వాగులపై హై లెవెల్ వంతెనల పనులను శుక్రవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ గౌడ్, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్, ఆశిష్, కర్స మోహన్ పాల్గొన్నారు

ధర్పల్లి: మండలంలోని వాడి గ్రామం వద్ద రూ.9.50 కోట్లతో నిర్మించనున్న హై లెవల్ వంతెన పనులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఆర్మూర్ బాలరాజ్, సర్పంచ్ బాగవ్వ, భగవాన్ రెడ్డి మిట్టపల్లి గంగారెడ్డి పాల్గొన్నారు.

లైబ్రరీకి 'సిరివెన్నెల' పుస్తకాలు ప్రదానం

తెయూ: తెయూ సెంట్రల్ లైబ్రరీకు స్వర్గీయ పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి సమగ్ర సాహిత్య పుస్తకాలను శుక్రవారం ప్రదానం చేశారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), పుస్తకాల ప్రచురణ గౌరవ సంపాదకుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ తరపున ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ వి.త్రివేణి వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరికి ఈ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ... అసంఖ్యాక తెలుగు ప్రజానీకానికి అభిమాన సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, యూజీసీ డైరెక్టర్ సీహెచ్.ఆంజనేయులు, పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ కె.సంపత్ కుమార్, ఎస్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కె.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న ప్రొఫెసర్ త్రివేణి

సేవాలాల్ జయంతికి సెలవు ఇవ్వాలి

నిజామాబాద్ సిటీ: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు ప్రకటించాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వినాయక్‌నగర్ సంఘంలో అయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతి రోజు సెలవు లేకపోవడంతో బంజారా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమావేశంలో బాబురావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

గాజుల్‌పేటలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని గాజుల్‌పేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. వివరాలు.. కాలనీకి చెందిన వాసుగౌడ్ శబరిమల వెళ్లాడు. ఆయన భార్య సునీత ఈ నెల 15న దుబ్బలోని తన తల్లిగారింటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం వాసుగౌడ్ ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.2 లక్షలు, 12 తులాల బంగారం, కిలోన్నర వెండి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయులకు బదిలీలు సహజం

మోపాల్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని, ఎక్కడ పని చేసినా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యతను మర్చిపోవద్దని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. నగర శివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి గతంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం స్కూల్ ఆవరణలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలన్నారు. ఉపాధ్యాయులు సాగర్, విజయలక్ష్మి, రాణి, సంధ్యారాణి, అబ్బయ్య, పద్మావతి, శ్రీధర్ బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీఈవో

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి



బ్రిడ్జి పనుల వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



పార్టీలో చేరిన వారితో అర్బన్ ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: నగరంలోని వెంగళ్‌రావునగర్ (బాబన్ సాహెబ్ పహాడ్)కు వెళ్లే మార్గంలో నిజాంసాగర్ కెనాల్‌పై బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గంలోని 11వ డివిజన్‌లో రూ.కోటితో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యత, గడువు వివరాలను తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే అధికారులతో సమావేశమై డివిజన్ల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీనిచ్చారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్ మమత ప్రభాకర్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి ప్రవళిక, ఖైజర్ ఉన్నారు.

బీజేపీతోనే సబ్ కా సాత్.. సబ్ కా వికాస్

సుభాష్‌నగర్: దేశంలో సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ బీజేపీతోనే సాధ్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో 37వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సహదేవ్, ప్రముఖ న్యాయవాది తుల గంగాధర్‌తో కలిసి 200 మంది కార్యకర్తలు శుక్రవారం పెద్దఎత్తున పార్టీలో చేరారు. వారికి అర్బన్ ఎమ్మెల్యే కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గతంలో కంటే అధిక మెజార్టీతో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, భరత్ భూషణ్, గడ్డం రాజు, పుట్ట వీరేందర్, బొట్టు వెంకటేష్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో 34వ డివిజన్‌లో అయోధ్య అక్షింతలను శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి అయోధ్య అక్షింతలు అందజేస్తున్నామన్నారు. ఈనెల 22న ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాయకులు రోషన్ లాల్ బోరా, పవన్ ముందాడ, బంటు ప్రవీణ్, సురేష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర వంజరి సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వంజరి సంఘం ఉపాధ్యక్షుడు మాస్టర్ వంజరి శ్రీనివాసరావు, కాలేరు గడ్డం శ్రీనివాస్, అయ్యప్ప గోపాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు భోనేకర్ భూమయ్య, గంగోని గంగాధర్, లడ్డు నరసయ్య, బొదుకం శ్రీనివాస్, మామిడిపల్లి రాజు, భరత్ కుమార్, కాలేరు సురేష్ పాల్గొన్నారు.



సమాచారం

నేడు నగరంలో విద్యుత్ కోతలు

నిజామాబాద్‌నాగారం: సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం నగరంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈలు చంద్రశేఖర్, రాజశేఖర్ తెలిపారు. పవర్ హౌస్, తిలక్ గార్డెన్, వినాయక నగర్, బోర్గం, దుబ్బ, న్యూ కలెక్టర్ ఆఫీస్, ముబారక్ నగర్, సుభాష్‌నగర్, అర్సపల్లి, మిర్చి కాంపౌండ్, న్యూ హౌసింగ్‌బోర్డు, గూపన్‌పల్లి ఉపకేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

నేడు దుబ్బాకలో న్యాయ చైతన్య సదస్సు

ధర్పల్లి: మండలంలోని దుబ్బాకలో శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ వస్తున్నట్లు పేర్కొన్నారు.

జక్రాన్‌పల్లిలో..

నిజామాబాద్‌రూరల్(జక్రాన్‌పల్లి): జక్రాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ సేవా సమితి సమావేశం ఉందని ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు రావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల/ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అర్షీ ఇక్బాల్, ఉపాధ్యాయుడు రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఐదో తరగతిలో 80 సీట్లకు 60 సీట్లు మైనార్టీలకు, 20 సీట్లు నాన్ మైనార్టీలకు కేటాయిస్తారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 60 సీట్లకు గానూ మైనార్టీలకు 40 సీట్లు, నాన్‌మైనార్టీలకు 20సీట్లు ఉంటాయన్నారు. అలాగే అలాగే 6, 7, 8వ తరగతులకు మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేయడానికి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

22వరకు భజన కార్యక్రమాలు

డిచ్‌పల్లి: అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 22వరకు ప్రతి రోజూ భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండలంలోని నర్సింగాపూర్ (కొత్తపేట్) శ్రీశబరిమాత భజన మండలి సభ్యులు తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు హనుమాన్ పారాయణం, శ్రీరామ భజన కీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ నెల 29న ఎస్ఎంసీ ఎన్నికలు

సిరికొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 29న పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ముగ్గురు సభ్యులు, ఇద్దరు కో ఆప్షన్ సభ్యుల ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారన్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	80	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	45	60	ఆలుగడ్డ	15	30
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	80	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	25	50
పాలకూర	10	20	కరివేపాకు	60	80
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	63,750	వెండి (కిలో)	75,500
22 క్యారెట్స్	58,783		

– నిజామాబాద్ బిజినెస్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	గుంటూరుకారం -7.40 నా సామిరంగ - 1.35, 4.35, 10.45
స్క్రీన్-2	గుంటూరుకారం (తెలుగు) - 10.25, 4.20, 10.30 సైంధవ్ (తెలుగు) - 1.30, 7.30
స్క్రీన్-3	హనుమాన్(తెలుగు) - 10.30, 1.30, 4.30, 7.35, 10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	హనుమాన్-9.40, 1.00, 4.20, 7.40, 11.00
స్క్రీన్-2	హనుమాన్(తెలుగు)-12.00, 6.40, 10.00, గుంటూరుకారం - 3.20
స్క్రీన్-3	గుంటూరుకారం(తెలుగు)-11.40, 6.20, 9.40 హనుమాన్(హిందీ)-3.00
స్క్రీన్-4	నా సామిరంగ (తెలుగు)-12.40, 6.50, 10.00 సైంధవ్ (తెలుగు) - 3.50
దేవి	హనుమాన్(తెలుగు)
నటరాజ్	నా సామిరంగ(తెలుగు)
లలితామహల్	గుంటూరు కారం(తెలుగు)
విజయ్	సైంధవ్(తెలుగు)

సంక్షిప్తం

మంత్రిని కలిసిన జిల్లా కాంగ్రెస్ నేతలు



ఖలీల్‌వాడి: బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, దయాకర్‌గౌడ్, భోజన్న శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి సన్మానించారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలని మంత్రి జిల్లా నేతలకు సూచించారు.

బీఎల్‌పీ జిల్లా కన్వీనర్‌గా మధు



ఖలీల్‌వాడి: బహుజన లెఫ్ట్ పార్టీ(బీఎల్‌పీ) జిల్లా కన్వీనర్ కాంబ్లె మధు ఎన్నికైనట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ ప్రకటించారు. నగరంలోని ప్రభుత్వ రోడ్లు భవనాల అతిథి గృహంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో కన్వీనర్‌గా కాంబ్లె మధు, కో కన్వీనర్లుగా అబ్బగోని అశోక్‌గౌడ్, ఎండీ సయ్యద్, బాల్‌రాజ్‌తో పాటు మరో 10 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వాడి సర్పంచ్



ధర్పల్లి: మండలంలోని వాడి సర్పంచ్ బాగవ్వ, బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆర్మూర్ బాలరాజ్, భాస్కర్ రెడ్డి, కృష్ణ, గంగారెడ్డి పాల్గొన్నారు.

'వసతులు లేకున్నా న్యాక్‌గుర్తింపు ఎలా ఇస్తారు'

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నిశిత డిగ్రీ కళాశాలలో కనీస వసతులు లేకున్నా న్యాక్ గుర్తింపు ఎలా ఇస్తారని టీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు వెంకటేష్, గిరిష్ శుక్రవారం తెయూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలో అన్ని వసతులతో ఉన్న గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రెండేళ్లకు ఒకసారి తనిఖీ చేస్తారన్నారు. కానీ కనీస సౌకర్యాలు లేని నిశిత కళాశాలకు శాశ్వత గుర్తింపు ఎలా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఖలీల్‌వాడి: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా కాంగ్రెస్ నేతలు పంచరెడ్డి చరణ్, శివ కలిశారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు.